# దరిద్రుని నికృష్టజీవితం

* శ్రీ నేమాని సూర్యారావు *

నడవలేక నా కాళ్లు అరిగిపోతున్నాయ్. అడగలేక నా నోరు ఎండిపోతుంది, చూడలేక నా ఆశాపూరిత నేత్రాలు చెమ్మగిల్లుతున్నాయి. ఒకనాడు కాదు, రెండురోజులైనా వస్తుండవచ్చు. కానీ వారాల తరబడి, నెలలతరబడి వస్తుండాలంటే—సర్వసమాన్వితమైన యీ నేటి నాస్వతంత్ర భారతభువిలో నాకీ యిదేనా, సర్వమానవ హక్కునుపొందే మానవ ప్రపంచం ...... నా ఆశాహృదయం, మేడలలో సుషుప్తావస్థలోనున్న ధనవంతులపైకి ఎగబ్రాకుతుంది. పాపం! తిన్నతిండి అరగక వాళ్లు బాధపడుతుంటే, తిండిలేని నాకు వాళ్ళబాధచూచి చాలా జాలిగావుంది. తాను తినగా మిగిలిందయినా యితరులకు పెట్టని ఆ స్వార్థ మానవరాక్షసులు యింకా గడించి ఏమిచేస్తారు? బహుశా, ఆ వెండి బంగారాల్ని చూచుకొని, సంతుష్టిలేని తన నేత్రజలంతో అభిషేకం చేస్తాడు కాబోలు! ఇనుపపెట్టెలతో ఆ రూపాయలుకూడా తుప్పుపట్టేవరకూ దాయకపోతే—తన నిత్య జీవితంలో తనచుట్టూ, అన్నార్తులైన తన తోటి సోదర మానవులకు ఉపయోగపడేట్టు సద్వినియోగం చేయరాదూ? ఏం? అలాచేస్తే తన పెరిగే పొట్టలు తరిగిపోతాయనా?... పూర్వం ఒకప్పుడు గాంధీ చెప్పాడు: 'మనంపుట్టడం ఎందుకంటే మనవల్ల ఏ కొద్దిమందయినా సుఖించాలి, సంతోషించాలి. ఆనాడే మనం పుట్టడాన్ని సార్థకంచేసినవారమవుతాం'—అని. ఏదీ ఏ ధనవంతుడు ఆచరణలో పెట్టాడు? దరిద్ర నారాయణుడైన గాంధీజీని ఓ ప్రక్క గొప్పగాపొగడుతూ, రెండో ప్రక్క తత్ వ్యతిరేకమైన క్రియల్ని తు. చ. తప్పకుండా ఆచరిస్తున్న యీ సోమరిపోతు పీడిత ప్రజాబాహుళ్యానికి ఆశాజ్యోతులు !! ...కష్టించి పనిచేసేవాళ్లు జీవితాలు అధ్వానంగా, అయోమయంగా వుంటే—నెత్తిఎక్కి స్వారీచేసి, తనఆజమాయిషీని యీ కూలిజీవాల నెత్తిపై రుద్ది నాట్యమాడించే యీ షావుకార్ల,* పెట్టుబడిదార్ల, జమీందార్ల, జీవితాలు - సుఖమయంగాను, సంతోషపూరితంగానూ వున్నాయంటే—దీనికంతకూ ముఖ్యకారణం. ఈ నేటి ఆర్థికవ్యవస్థే, యీ ఆర్థిక వ్యవస్థ ఏనాడైతే తారుమారు అవుతుందో ఆనాడు యీ యావత్ భారతావని ఫలప్రదం అవుతుంది, నిలువ నీడలేక, తిన తిండిలేక బాధపడే యీ ప్రజావళి మనకు తెలియకుండానే మాయమవుతారు.

తనకొంప మునిగిపోయినట్లు సూర్యభగమానుడు అప్పుడే తూర్పుదిశాంగనా వడిలోనుండి, తలపైకెత్తి అంధకారమయమైన యీ జగత్తును తన వేయివేల కిరణాలతో తరిమివేస్తున్నాడు. కానీ నా జీవితరథ చక్రాల్నిమాత్రం దారీతెన్నూలేని ఓ అభాగ్యస్థలంలో విడిచిపెట్టాడు. తెల్లవారకముందే మా జమీందారుగారి బంగళాకు హాజరయి, నా జీవితరస మృదుమధుర అవయవాల్ని,-బలిష్టమై మెలితిరిగిన నా కండల్ని,- రక్తంతో ఎఱ్ఱబారి మిలమిల మెరిచే నా జీవకణాల్ని, వల్లగావున్నా శరీరం అంతటికీ ముఖ్యమై, అవసరమైన నా గుండెను, — పిండి, నలిపి, వడపోసి, పెత్తుకొచ్చి అనుభోగయోగ్యమగు సన్ను

ర్పించి, రిక్తచేతులతో, బరువెక్కిన గుండెతో, తేలిపోయే కాళ్ళతో, అలవాటుపడ్డ నీరసంతో, శూన్యదృక్కులతో, రాత్రి ఏపదింటికో గృహోన్ముఖుండనగుట నాకు పరిపాటియేకదా! ... యీమాత్రం దానికి-నాకొక్కడికీ కాకపోయినా, ప్రపంచానికంతకూ ఆధారమైన, ఆ ఉదయించబోయే సూర్యభగవానుడు నాకు బరువైతే...

అనిఅంటూ అప్పటికే బరువెక్కిన తనగుండెకు కొంత విశ్రాంతి యిచ్చుటకు కాబోలు ఆగాడు. ఇంతవరకూ, నిర్విరామంగా నడచిన నా కలానికి కొంతవిశ్రాంతి దొరికింది. ఇటువంటి విషాదమిళితపూరితమైన జీవితచరిత్రల్ని వ్రాయుటకు అలవాటుపడ్డ నాకలం, ఆలశ్యానికి తాళలేక—తడిలేక ఎండిపోతున్న అతని నాలికను తొందరచేయసాగింది.

నా ఫ్లాస్క్.లోవున్న కాఫీని కొంతఆయనకు యిచ్చిన తదుపరి మెలితిరిగిన తన నికృష్టజీవితశోభను ప్రారంభించాడు యీవిధంగా.

ఇప్పటికే నావృత్తి ఏమిటో, నేనెవరినో, మీరు గ్రహించే వుంటారు. అసలు పూర్వం జమీందారైన మా పెదనాన్నగారు, తమ్ముడుకూడా జీవించియున్నట్లయితే తనఆస్తి తగ్గిపోతుందని, మా నాన్నగార్ని యీ నవ్యస్వార్థ ప్రపంచాన్నుండి వేరుచేసిన పుణ్యాత్ముడు. నాతల్లిని ఇంటినుండి గెంటించి తనే మా జమీ అంతటికీ సర్వాధికారిఅయినాడు. 'దిక్కులేనివారికి దేవుడే దిక్కు—' అనే సామెతను భుజంపై వేసుకొని బయలుదేరింది ఎక్కడకో మా తల్లి...ఎక్కడకని వెళుతుంది. చిన్ననాటే తల్లిదండ్రులు పోయిన మా జననికి తోబుట్టువులుకూడా లేని నిర్భాగ్యురాలు మా మాత. ఈ సువిశాల ప్రపంచంలో 'నా' అనే దిక్కులేని ఆ మూడవనెల గర్భిణీతో పయనమైంది ఎచ్చటకో, తనకే తెలియని గమ్యస్థానానికి. ఏనాడుకూడా, ఎండకన్నెరగని మాఅమ్మ నేడు తిండికి కరువై కాళ్లు అరిగేట్టు తిరుగాడుతూ ఓచోట నీరసించి స్పృహతప్పి పడిపోయిందట—తెలివివచ్చి చూసేప్పటికి ఓదయామయులైన వృద్ధదంపతుల గృహంలో వున్నదట. తాను స్పృహతప్పివుండగా వీరు యీ శాంతి గృహానికి తెచ్చినట్లు తరువాత గ్రహించిందట. నేను ఆ శాంతిస్థలంలోనే జననమొంది 7, 8 సం॥లు వరకూ అచ్చటనే యున్నట్లు జ్ఞాపకం. నేను ఇంగితజ్ఞానం సంపాదించుకుంటున్న ఆ సంవత్సరాలలోనే మాయీ నికృష్ట జీవితాన్ని నాతల్లి నాకు చెప్పింది. అదే యీనాడు నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ—ముఖ్యవిషయాల్ని మరచిపోనీకుండా-మీకు చెప్పుతున్న నా యీకథ—కాదు, కాదు—మీ కలానికి పనికివచ్చే స్వార్థమానవ కల్పితక్రియుఖండన. ఎవరిసుఖమే తనసుఖమని యెంచి యింతవరకూ జీవించివుందో—ఎన్ని కష్టాల్నిఅయినా చిరునవ్వుతో ఎదుర్కొని యీ స్వార్థ సమాజానికి బలికాకుండా ఎవరిగురించి జీవించివుందో—ఆట్లునేను తొమ్మిదోఏట తల్లిని పోగొట్టుకున్న నిర్భాగ్యుణ్ణయ్యా...యికవున్న ఒకదిక్కూ కూడా కాలగర్భంలో కలసిపోయింది. 'నా' అనే దిక్కు అంతర్ధానమైంది. నేను జీవించడం కూడా దేవుడుకు బరువైంది కాబోలు! నేను చస్తేమాత్రం యీ భువికి కొదువా? జీవించివుంటే మాత్రం నే చెయ్యాల్సిన పని ఏమిటి? నేను ఎవర్ని గురించి జీవించివుండాలి?...అని నామనస్సు పరిపరివిధాల భీకర భయంకర విలయతాండవం చేసింది. 'ఆత్మహత్య మహాపాపం'--మనస్సుకు హృదయం చెప్పింది.

'నాకు నీవు పోషించుకోలేనప్పుడు ఆత్మహత్యకాక మరేమిటి?'—తిరుగు ప్రశ్న వేసింది మనస్సు. 'చచ్చిమాత్రం సాధించేదేముంది. బ్రతికి ఎంతపనైనా చెయ్యొచ్చు. యీస్వార్థమాన్నవుల్ని—అభ్యుదయ పురోగామిఅయిన యీ నేటి సంఘాన్ని పునాదులతో సహితం దొలిచే చీడపురుగుల్ని, నశింపచేయడానికి, తన యావశ్శక్తినీ ఉపయోగించవచ్చుగా?'—హృదయం ఘోషించింది.

'తిండి పెట్టడానికి అఘోరించే యీ సంఘం, మంచిమాటల్ని చెప్పే నాలికను ముక్కలు కొయ్యకుండా వూరుకుంటుందా?'—యదార్థ విషయాన్ని చెప్పింది మనస్సు.

'మంచి మాటలతో బుద్ధిచెప్పి పురాణకాలం నాటి బూజుపట్టిన సంఘాన్ని మరామత్తు చేస్తుంటే, యీ స్వార్థ సంఘంమీద పడుతుందని భయపడుతున్నావా?...అయితే దొంగను దొంగ గారని స్తే గొప్పేముంది?'—సాక్షీగా నీతిని బోధించింది హృదయం.

మనస్సు హృదయాల మధ్య జరిగిన యీ ప్రళయానికి నాబుఱ్ఱ వేడెక్కింది. మెదడు కరిగిపోతుందేమోనని భయమేసింది ... ఆకలి దహించుకుపోతూంది...అది ఒక కాఫీదేవాలయం...జనం ఎడతెరిపిలేకుండా పోతున్నారు, వస్తున్నారు. జేబులో రాగిపైసా లేదు. మెట్లవరకూమాత్రం వెళ్ళి నిలబడ్డా. ఆకలివేస్తున్న పొట్టను చేత్తోపట్టుకుని, "నాయనా! ఆకలివేస్తూంది. కొంచెం ఏమైనా పెట్టండి, మీకు పుణ్యంవుంటుంది."—అని అర్థించీ ఆ డ్రాయరు ప్రక్కకుర్చీలో కూర్చొని, తలను ప్రక్కకు కూడా త్రిప్పటానికి వీలులేండా, డబ్బునంతనూ డ్రాయరులో తోచుకుంటున్న అయ్యరును, నావైపు చురచురచూచి "పోడా! షైత్ కారీ!"—అని హూంకరించాడు, తెలుగువాళ్ళ డబ్బు వంటబట్టిన ఆ అయ్యరు యిక విధిలేక ఆ ఆకలిమంటతో వెనుదిరిగా...కరువులో అధికమాసంలాగ ఓ 9 ఏండ్ల బాలిక చిరిగిమురికిన గుడ్డలతో యీదరిద్రున్ని ఆశ్రయించింది. ఏమిటి చెయ్యడం? యిలా ఎంత మందివున్నారో కదా?...ఆ బాలిక ఆశాపూరిత నేత్రాలు యింకా నావేపే దీక్షగా చూస్తున్నాయ్. కర్కశ పాషాణమయపూరితమైన ఆ అయ్యరు హృదయం, నాదగ్గర లేదు కాబట్టి పొమ్మనలేక పోయా. కానీ ఎలా?...ఒక్కసారిగా నాబుఱ్ఱలో కుడిగుండం గిఱ్ఱుమని తిరిగాయ్.

నిస్సహాయి అయిన ఆ అమ్మాయిని తీసికొని బజారులుదేరా ఎక్కడికో కర్తవ్యంలేని ఉన్మాదునివలె. నా శరీరం చెప్పుతూంది: 'అనంతమైన అగాధభూగర్భంలో ఆలయం కట్టుకుందాం పద'—అని... పెద్ద జీవికి ఓ చిన్న జీవి సాయందొరికింది. ఈదేశంలో వీటికి మాత్రం కరువులేదు... ఏది వూరుకున్నా కడుపు వూరుకోదుగా. కడుపుకు తగినమేత వేయటానికి తగిన స్థోమత నావద్ద అసలే లేదుగా. యీకడుపుకుతోడుగా యింకో కడుపు వుందిగా—దీనినే అంటూరుకాబోలు పెద్దలు 'ఉట్టికి ఎక్కలేనమ్మ స్వర్గానికి తాపత్రయం పడిందని'.

నాకు తగిన ఆశ్రయాన్నివ్వలేని యీ సంఘం నుండి తప్పిబోయి, పీడితప్రజ పాలిట రాక్షసుడైన ఓ జమిందారుకు అమ్ముడు పోవలసివచ్చెను. నా హృదయానికి నేను ఎదురుతిరిగా యిక గత్యంతరం లేక: హృదయం చెప్పింది. 'ఏనాటికైనా స్వతంత్ర జీవనానికి అలవాటుపడవోయ్. ఎన్నాళ్ళీ మురికి బానిసత్వంలో ఆసుఖాన్ని అనుభవిస్తావ్. అమృతమయమై అందున్న ఆనందసౌఖ్యాల్ని అందుకుంటానికి ప్రయత్నించు'—అని...కానీ యీ దౌర్భాగ్యునికి ఆప్రయత్నం ఎట్లా?...

అని అంతవరకూ రొప్పుకుంటూ, ఒగుర్చుకుంటూ, ఆయాసపడుతూ, అవస్థపడుతూ, చెప్పిన తన నికృష్టజీవిత చరిత్రను నాకలం సావకాశంగా చిత్రించి, కృతజ్ఞతను తెలియచేసింది.

అంతకన్నా, నా కలంగాని, నేనుగాని—ఆ బానిసజీవికి ఏమి చెయ్యగలం?

---

## కొత్తరకం బియ్యం

బియ్యానికి బదులుగా ఒకరకం గోధుమల నుంచి బియ్యం తయారు చేయడానికి ఒక అమెరికన్ కెమిస్టు పరిశోధనలు జరుపుతున్నాడు.